సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు

ఏడాదైనా మాటల్లోనే..!

- అమలుకాని 'కూటమి' హామీలు
- జిల్లా ప్రాజెక్టులకు దక్కని నిధులు
- కూటమి పాలనకు ఏడాది

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

2024 ఎన్నికల ఫలితాల్లో టిడిపి కూటమి ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది పూర్తి చేసుకుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు, 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా రెండు ఎంపీ స్థానాలను, 12 అసెంబ్లీ స్థానాలను కూటమి కైవశం చేసుకుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురికి మంత్రి పదవులు వరించాయి. ఎన్నికలకు ముందు టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జిల్లా వాసులకు పలు హామీలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా హామీలు అమలు కాలేదు. జిల్లా ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. దాంతో ప్రాజెక్టులకు అడుగులు ముందుకు పడలేదు...

• గతి లేని గుండ్రేవుల

కర్నూలు, కడప జిల్లాలకు మేలు కలిగిలే రూపొందించిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన చర్యలేవీ ఇప్పటి వరకూ మొదలు కాలేదు. గుండ్రేవుల జలాశయం నిర్మాణం జరిగితే 20 టిఎంసిలు నిల్వ చేయనున్నారు. వరద లేని సమయంలోనూ ఈ నీటిని వాడుకోవచ్చు. 2013 నవంబర్ 1న అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం జీవో 100 జారీ చేసి సర్వే కోసం రూ.51.95 లక్షలు మంజూరు చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు సంస్థ సర్వే చేసి రూ.2,890 కోట్లతో సమగ్ర నివేదిక ప్రభుత్వానికి పంపింది. ఆ తరువాత టిడిపి ప్రభుత్వం పరిపాలనా ఆమోదం ఇచ్చింది. ఎన్నికలకు ముందు చంద్రబాబు గుండ్రేవుల చేపడతామని చెప్పినా ఇప్పటి వరకూ అడుగులు పడలేదు.

• ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు

కరవుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసల్లి , సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించు కోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి. పథకం ప్రారంభంలో వేసిన గొట్టాలు దెబ్బతిన్నాయి. ఒక్కో ఎత్తిపోతల కింద 500 నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది.

• దిష్టిబొమ్మల్లా టిడ్కో గృహాలు

పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో గతంలో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. లబ్ధిదారులకు టిడ్కో గృహాలు ఇస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేరలేదు. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు నగరంలోని జగన్నాథగట్టుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కర్నూలు నగరంలోని జగన్నాథగట్టు వద్ద 10 వేల గృహాల నిర్మాణం చేపట్టారు. ఆదోనిలోని సిరిగుప్ప రోడ్డులో 4704 గృహాలను నిర్మించారు. ఎమ్మిగనూరులో శివన్న నగర్‌లో 2240, మైనార్టీ కాలనీలో 1024 ఇళ్లు ఉన్నాయి. నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ, డోన్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నంద్యాలలోని నందమూరి నగర్‌లో 3,904 ఇళ్లు, అయ్యలూరి మెట్ట దగ్గర 2,272 ఇళ్లు, ఎస్ఆర్‌బిసి కాలనీలో 3,824 ఇళ్లను నిర్మించారు. ఆళ్లగడ్డలో చింతకుంట గ్రామ శివార్లలో 1,296 ఇళ్లు, డోన్‌లో హైవే సమీపంలో 306 ఇళ్లను కట్టించారు. ఎక్కడా కూడా లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ ఇళ్లకు విద్యుత్, మంచినీటి సైకర్యం, రోడ్లు, డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేయలేదు. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

• రాజోలికి పడని అడుగులు

చాగలమర్రి మండలంలో రాజోలి వద్ద నిర్మించనున్న రిజర్వాయర్‌కు అడుగులు పడలేదు. ప్రతి ఏటా కుందూ నది నుంచి వచ్చే వరద నీరు సోమశిలకు చేరి, ఆ తరువాత సముద్రంలో కలిసి వృథా అవుతోంది . దీంతో రాజోలి వద్ద 2.95 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. 2008 డిసెంబరు 24న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశే ఖర్ రెడ్డి రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తరువాతి ప్రభుత్వాలు పట్టించుకోకపోవ డంతో నీటి వృథా కొనసాగుతోంది. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకా 2.95 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి జీవో ఇచ్చారు. రూ .1,357.10 కోట్లతో చేపట్టే పనులకు జ్యుడీషియల్ ప్రివ్యూ ఆమోదం లభించింది. ఈ పనులకు జలవనరుల శాఖ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కూడా శంకుస్థాపన చేశారు. అయినా ఇప్పటి వరకూ పనులు ప్రారంభం కాలేదు.

• ప్రారంభానికే టమోటా ప్రాసెసింగ్ యూనిట్

గతంలో పలు సార్లు చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లాలోని పత్తికొండ ప్రాంతంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్న హామీ శంకుస్థాపనకే పరిమితమైంది. గత ప్రభుత్వంలో పత్తికొండ శివార్లలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ కోసం మూడెకరాల స్థలాన్ని కేటాయించారు. ఆ ప్రాంతంలో అధికారులు భూమిపూజ కూడా చేశారు. యూనిట్ నెలకొల్పేందుకు రూ.12.5 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. పునాది దశలో పిల్లర్లు వేసి ఆపేశారు. తరువాత కూటమి ప్రభుత్వం ఆ ప్రాసెసింగ్ యూనిట్‌ను కనకదిన్నెకు మార్చింది. అక్కడ మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేశారు.

హామీల అమలులో విఫలం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి వైఫల్యం చెందింది. అధికారం చేపట్టి ఏడాది పూర్తి అయిన ఒక పింఛన్ ఇవ్వడం తప్ప సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదు. పి4 పథకం అంటూ ప్రజలను మభ్యపెడుతున్నది. సంక్షేమ పథకాలు అమలు పరచకపోగా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు అంటూ ప్రజలపై భారాలు మోపింది. కరెంటు చార్జీలు రకరకాల పేర్లతో వచ్చిన వాడిన బిల్లు కంటే అదనపు చార్జీలు రెండు రెట్లుగా వసూలు చేస్తున్నారు. ఇంటి పన్నులు పెంచుతున్నారు. ప్రతి పేద కుటుంబానికి పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు స్థలము, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల స్థలమంటూ చెప్పినా ఇప్పటివరకు ఎక్కడా స్థలాలు ఇచ్చినట్లు పాపాన పోలేదు. ఉన్న టిడ్కో గృహాలు కూడా లబ్ధిదారులకు ఇవ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేందుకు కనీస చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- జిల్లాలో 2294 పనులు చేపట్టేందుకు రూ.2014 కోట్లు
- రూ.80 వేల కోట్లతో పోలవరం - బనకచర్ల నిర్మాణం
- అది పూర్తయితే రాయలసీమ సస్యశ్యామలం
- జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. బుధవారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో రూ.678.50 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, రూ. 141 లక్షల రూపాయల వ్యయంతో కర్నూలు-అనుగొండ రోడ్డు నుండి దొడ్డిపాడు వరకు నిర్మించిన తారు రోడ్డు, రూ.2,250 లక్షలు అంచనా వ్యయంతో రెండు వరసల రహదారిగా వెడల్పు చేసి నిర్మించిన నన్నూరు-చిన్నటేకూరు- కె.నాగలాపురం-గూడూరు-సి.బెలగళ్ - ఎమ్మిగనూరు రోడ్ ప్రారంభం, రూ.40 లక్షల రూపాయల వ్యయంతో ఎన్‌హెచ్ 40 నుండి నన్నూరు ఎస్సీ కాలనీ చర్చి వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు పునర్నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే కాకుండా యావత్తు భారతదేశానికి ఒక స్ఫూర్తిదాయకంగా తడకనపల్లి గ్రామం నిలిచిందన్నారు. అటువంటి గ్రామంలో ఈరోజు ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా వివిధ శాఖల ద్వారా 10 నెలల కాలంలోనే 2294 పనులు చేపట్టేందుకు రూ.2014 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇందులో కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని పురోగతిలో ఉన్నాయని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా 9, 718 ఎకరాలు సేకరించి ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జైరాజ్ ఇస్పాత్ 413.19 ఎకరాల్లో రూ.2938 కోట్ల పెట్టుబడితో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. అలాగే 300 ఎకరాలలో డ్రోన్ కార్పొరేషన్, 1002.36 ఎకరాలలో పీపుల్ టెక్ కంపెనీ ద్వారా సెమీ కండక్టర్, బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కర్నూలు జిల్లాలో రూ.320 కోట్లతో జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ పరిశ్రమ ఏర్పాటు అవుతోందన్నారు. రూ.11 కోట్లతో టమాటో ప్రాసెసింగ్ యూనిట్, 77 ఎకరాల్లో ఎమ్మిగనూరు లో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముచ్చుమర్రి నుండి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు రూ.428 కోట్లతో నీటి సరఫరా కోసం పైప్ లైన్ పనులు త్వరలో పూర్తి కానున్నాయన్నారు. గ్రీన్ కో కంపెనీ ద్వారా 1680 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ త్వరలో ప్రారంభం కానుందన్నారు. 10 నెలల కాలంలోనే 7 వేల హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ లక్ష్యం కాగా 5,653 హెక్టార్లలో డ్రిప్ ఏర్పాటు చేశామన్నారు. పాణ్యం శాసనసభ్యులు, సర్పంచ్ చెప్పిన సమస్యలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత , జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, నాయకులు పెరుగు పురుషోత్తం రెడ్డి, జనసేన జిల్లా ఇంచార్జ్ చింత సురేష్ బాబు, బిజెపి జిల్లా నాయకులు జిఎస్ నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

ఏరువాక కార్యక్రమంలో మంత్రి

అనంతరం తడకనపల్లెలో ఏరువాక కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామా నాయుడు పాల్గొన్నారు. పొలం దున్ని, ఉల్లి విత్తనాలు చాల్లారు. గతంలో టిడిపి ప్రభుత్వంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ కల్పించారని గుర్తుచేశారు. రాష్ట్రం అన్ని విధాలా సుభిక్షంగా ఉండాలన్న ఆశయంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు.

ఏరువాక పౌర్ణమి సందర్భంగా పొలం దున్నుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

నేటి నుంచి మోగనున్న బడిగంటలు

- ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ
- నిర్వీర్యం దిశగా ప్రభుత్వ పాఠశాలలు
- ఇంకా పూర్తికాని ఉపాధ్యాయ బదిలీలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుండి పాఠశాలల పాఠశాలల తలుపులు తెరుచుకోనున్నాయి. విద్యార్థులు కూడా పాఠశాలలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో మాత్రం ఫీజుల దోపిడీ మరింత విచ్చలవిడిగా పెరిగింది. మరో పక్క ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యం దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు1462, ప్రైవేటు పాఠశాలలు778 దాకా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవో నెంబర్117 రద్దు చేస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు కనిపించలేదు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో అమలు చేసిన విధానాలను మరింత పకడ్బందీగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుంది. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే విధంగా తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థను తీసుకువచ్చింది. ఒకవైపున ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెబుతూనే మరోవైపున వీటిని పూర్తిస్థాయిలో పాఠశాలల సంఖ్యను తగ్గించేందుకు సన్నదమైంది. హైస్కూల్ సమీపంలో కిలోమీటర్ పరిధిలో ఉన్నటువంటి ప్రాథమిక పాఠశాలలను అన్నిటిని ఇందులో విలీనం చేశారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను వేసవి సెలవుల్లోనే పూర్తి చేస్తామని ప్రకటన చేసి ఇంకా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులను అస్తవ్యస్తంగా విద్యా శాఖ నిర్వహిస్తుంది. రోజుకొక ఉత్తర్వులను విడుదల చేస్తూ ఉపాధ్యాయులను అసహనానికి గురిచేస్తుంది. పాఠశాలలు తెరుచుకుంటున్నప్పటికీ ఇంకా బదిలీల ప్రక్రియ పూర్తికాకపోవడం పట్ల పలువురు మండిపడుతున్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కానుక కిట్లను పాఠశాలలకు ఇంకా పూర్తిస్థాయిలో చేరుకోలేదు. పాఠశాల తెరిచిన రోజే విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందజేస్తామని ప్రకటించినా ఆచరణకు నోచుకోలేదు.

కార్పొరేటు ప్రైవేట్ విద్యాసంస్థల్లో దోపిడీ

ప్రస్తుత విద్యా సంవత్సరం కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులను విపరీతంగా పెంచేశారు. గత విద్యా సంవత్సరం కంటే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఫీజులను దాదాపుగా 20 నుండి 40 శాతానికి పెంచేశారు. మరోవైపున అడ్మిషన్ ఫీజు, బుక్స్, స్కూల్ యూనిఫామ్, రవాణా ఫీజుల పేరుతో పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు వైఫల్యం చెందుతున్నారు. ప్రతి ఏడాది విద్యార్థి సంఘాలు ఫీజుల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో వసూలు చేస్తున్న ఫీజులను చూసి విద్యార్థులు తల్లిదండ్రులు షాక్‌కు గురవుతున్నారు. ఫీజులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మెరుగైన విద్యా బోధన అందిస్తాం

- ఎస్ శామ్యూల్ పాల్, డిఇఒ

విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నాం. ఈ విద్యా సంవత్సరంఉత్తమ విద్యాబోధన అందించేందుకు ప్రణాళికను రూపొందించాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నాం.

కోడుమూరు తహశీల్దార్‌గా నాగరాజు

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

కోడుమూరు మండలం నూతన తహశీల్దార్‌గా బి. నాగరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవిన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తమను కలవవచ్చు అని సూచించారు. మద్దికేర నుండి బదిలీపై కోడుమూరుకి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన వెంకటేష్ నాయక్ గూడూరుకు బదిలీ అయ్యారు. అనంతరం రెవిన్యూ సిబ్బంది నూతన తహశీల్దార్‌గా పుష్పగుచ్చాన్ని అందించి శాలువాతో సత్కరించారు.

పత్తికొండ తాశీల్దారుగా నబీ సాహెబ్

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ తహశీల్దార్ కార్యాలయంలో పత్తికొండ తహశీల్దార్‌గా నబి సాహెబ్ బుధవారం బాధ్యతలు స్వీకరించాలి. అనంతరం తహశీల్దదర్ మాట్లాడుతూ ప్రజలందరూ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఏవైనా సమస్యలుంటే నాదృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. విఆర్‌ఒలు , సర్వేయర్లు, రెవిన్యూ సిబ్బంది అవినీతికి పాల్పడితే చట్టమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహశీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది రవి, కృష్ణ, కేసన్న , అశోక్, సాగర్ రెడ్డి, భార్గవ నాయుడు శాలువా వేసి, పూలమాలతో సత్కరించారు.

గూడూరు తహశీల్దారుగా వెంకటేష్ నాయక్

ప్రజాశక్తి-గూడూరు



గూడూరు తహశీల్దార్ వెంకటేష్ నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కోడుమూరు తహశీల్దార్‌గా ఉంటూ గూడూరు బాధ్యతలు స్వీకరించారు. గూడూరు తహశీల్దార్ రామాంజనేయులు పత్తికొండ ఆర్‌డిఒ ఆఫీస్ కు డిప్యూటేషన్ కింద దేవనకొండ తహశీల్దార్‌గా వెళ్లారు. వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న విఆర్‌ఒలు ప్రతి రైతుకు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్య పరిష్కరించాలని, ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సి బెళగల్ తహశీల్దార్ గా వెంకటలక్ష్మి

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం నూతన తహసీల్దార్ గా వెంకటలక్ష్మి బుధవారం డిప్యుటీ తహసీల్దార్ పురుషోత్తముడు, రెవిన్యూ సిబ్బంది సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. రైతులకు, విద్యార్థులకు, ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందించడమే నా బాధ్యత అని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. రెవిన్యూ సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్, విఆర్‌ఒలు, సర్వేయర్, ఆర్‌ఐ తదితరులు విధుల్లో మెలకువలు పాటించాలని, మెరుగైన సేవలు అందించే దిశగా ఉండాలనికోరారు

సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్‌యేనా?

- ఎప్పుడు అమలు చేస్తారో చంద్రబాబు సమాధానం చెప్పాలి
- ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్‌యేనా అని ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఎప్పుడు అమలు చేస్తారో సిఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం షర్మిల విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు, కార్యకర్తల సమస్యలు తెలుసు కునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. గతంలో జగన్ మోహన్ రెడ్డి బిజెపికి దత్తపుత్రుడిగా ఉన్నారని, ఇప్పుడు చంద్రబాబు, పవన్ బిజెపికి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. బిజెపి రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని, అంబేద్కర్‌ను అవమానిస్తోందని, అయినా ఆ పార్టీకే రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలూ మద్దతు ఇస్తున్నాయని చెప్పారు. రాజ్యాంగాన్ని కాపాడటం కోసం, ప్రజల కోసం పోరాడేందుకు కాంగ్రెస్ పార్టీ అవసరం ఉందన్నారు. చంద్రబాబు పాలన సంవత్సరం పూర్తి చేసుకున్నా హామీలు అమలు చేయలేదన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ అని చెప్పి ఒక సిలిండర్ మాత్రమే ఇచ్చారన్నారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారని, ఒక్క మహిళనైనా మహిళా శక్తిగా మార్చారా అని ప్రశ్నించారు. కరెంట్ ఛార్జీలు పెంచబోమని చెప్పి ఈ ఏడాదిలోనే రెండు సార్లు కరెంట్ ఛార్జీలు పెంచారని చెప్పారు. రూ.17వేల కోట్ల భారం జనం నెత్తిన మో పారన్నారు. అనంతరం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో నియోజకవర్గ ఇంఛార్జిలతో పాటు పలువురు నాయకులతో షర్మిల మాట్లాడారు. ఏడాదిలో చేసిన కార్యక్రమాలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి తెలుసుకున్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్.షర్మిల

జిలానీ బాషాపై ఫిర్యాదులు.. కలుపుకొని పోవాలని షర్మిల సూచన

కర్నూలు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి జిలానీ బాషాపై నియోజవర్గానికి చెందిన పలువురు నాయకులు షర్మిల ముందు ఫిర్యాదు చేశారు. ఎవరినీ కలుపుకొని పోకుండా కార్యక్రమాలు చేస్తున్నారని, కమిటీలు వేయడం లేదని షర్మిల దృష్టికి తీసుకొచ్చారు. అందుకు షర్మిల స్పందిస్తూ అందరినీ కలుపుకొని పోవాలని, లేకుంటే మూడు నెలల తరువాత ఇంఛార్జిగా జిలానీ బాషా ఉండడని చెప్పారు. అందరినీ కలుపుకొని పోతానని, అందరినీ పిలిచి కార్యక్రమాలు చేస్తానని జిలానీ బాషా హామీ ఇచ్చారు. ఎఐసిసి కార్యదర్శి గణేష్ యాదవ్, పిసిసి కార్యదర్శి, జిల్లా ఇంఛార్జి రామకృష్ణ యాదవ్, నంద్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు జె.లక్ష్మినరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, నియోజకవర్గాల ఇంఛార్జిలు పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పున్నమి సంబరాలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఏరువాక పున్నమి సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. బుధవారం కర్నూలు మండలం, ఉల్చాల గ్రామంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన ఏరువాక పున్నమి సంబరాలు ఘనంగా నిర్వహించారు. జి.రామకృష్ణ మాట్లాడారు. డప్పు దరువులతో పెద్ద ఎత్తున చిందులు వేస్తూ ర్యాలీ నిర్వహించిన రైతులను గ్రామ ప్రజలను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ రైతులందరూ కులాలకు మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ ఏరువాక పున్నమి అని అన్నారు. భారతదేశంలో నూటికి అరవై శాతం, నేటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుందని అన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులు వచ్చినప్పుడు కూడా దేశానికి అన్నం పెట్టిన ఘనత రైతాంగానికి దక్కిందని కొనియాడారు. అలాంటి రైతాంగం పై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. అతివృష్టి, అనావృష్టి వల్ల రైతాంగం నష్టపోతే వారిని పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని జి.సింగవరం నుండి ఎత్తిపోతల పథకం ద్వారా ఉల్చాల గ్రామానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతులందరూ రాజకీయాలకతీతంగా ఐక్యం కావాలని కోరారు. రైతు సంఘం నాయకులు ఈ తాండ్రపాడు గ్రామ సర్పంచి బాలపీర, హుస్సేనయ్య, రైతు సంఘం గ్రామ కార్యదర్శి ఇస్మాయిల్, నాయకులు బడే సాహెబ్, మద్దిలేటి, కృష్ణ, నాగేష్ భీమేష్ వెంకటయ్య లోకన్న, నాగన్న, సవాద మద్దిలేటి, యువజన సంఘం నాయకులు ప్రకాష్, హరికిషన్‌రెడ్డి, రాము, అంజి, గోవర్ధన్, విశ్వనాథ్, సుధాకర్, రఘువరన్, గ్రామ రైతులు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని నగర పాలక సంస్థ ముందు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు , పార్కు క్లినిక్ , వీధి దీపాలు, మంచినీళ్ల సరఫరా చేసే కార్మికుల న్యాయమైన కోర్కెలను తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిష్కరించాలని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి. షరీఫ్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు ఆవాజ్ కమిటీ సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలిపింది. శాంతియుత ఆందోళన, పోరాటాలకు , ఆవాజ్ కమిటి మీ వెంట ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తక్షణమే దిగివచ్చి కార్మికులు, అధికారుల మధ్య ఆరోగ్యకరమైన చర్చ జరిపి కార్మికుల న్యాయమైన సమస్యలను, కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ నగర నాయకులు ఇలియాస్, రీయాజ్, మహబూబ్ బాష, అంజద్ బాషా, ఖలీల్ అహ్మద్, సల్కాపురం షాషా వలి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అవాజ్‌నేత ఇక్బాల్‌హుస్సేన్

రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, డిసిసిబి ఛైర్మన్ విష్ణు

ఆదర్శ మండలంగా అభివృద్ధికి కృషి

కోడుమూరు ఎమ్మెల్యే, కెడిసిసిబి ఛైర్మన్

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్‌ను ఆదర్శ మండలంగా తీర్చిదిద్ది మరింత అభివృద్ధికి కృషి చేస్తామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కెడిసిసిబి ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సిబెళగల్ లోని పలుకుదొడ్డి,సంఘాల గ్రామాలకు బిటి రోడ్డు కోసం పలుకుదొడ్డిలో శంకుస్థాపన చేశారు. ఛైర్మన్ అయిన తర్వాత విష్ణువర్ధన్‌రెడ్డి తొలిసారి సిబెళగల్ మండలానికి రావడంతో పోలకల్ నుండి యనగండ్ల, సి బెళగల్, పలుకుదొడ్డి, సంఘాల , ఆయా గ్రామాల నుండి నాయకులు, కార్యకర్తలు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని స్వాగతం పలికారు. పుష్పగుచ్చాలు అందించి పలువురు ఘనంగా సన్మానం చేశారు. పలుకుదొడ్డిలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. ప్రస్తుతం పలుకుదొడ్డి - సంఘాల రోడ్డుకు మూడు కోట్లు, సి బెళగల్‌లో ఓవర్ హెడ్ ట్యాంకుకు రూ.90 లక్షలు, చింత మాను పల్లెలో జల్ జీవన్ మిషన్‌కు రూ.90 లక్షలు , మండలంలో పలు గ్రామాల్లో 11 సిసి రోడ్లకు, 10 మురుగు కాల్వలకు సుమారు రూ.కోటి వెచ్చించామని అన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో ఇప్పటికే ఇరవై కోట్లు పైనే ప్రభుత్వం నుండి తెప్పించి అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎంపిడిఒ రానెమ్మ, ఇఇ మహేశ్వర్‌రెడ్డి, డిఇ కర్రెన్న, ఎఇ లు గోనె నాయక్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపికి అవమానం : సి.బెళగల్ మండలం అభివృద్ధి పనులలో భాగంగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కెడిసిసిబి ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. శిలాఫలకంలో ఎంపిపి బొంతల మునెప్ప పేరును కనపరచి ఆహ్వానం కూడా అందించారు. కార్యక్రమంలో ఆయన పేరు ప్రస్తవించక పోవడం కనీసం స్టేజి పైకి ఆహ్వానించకకుండా అధికార పార్టీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రోటోకాల్ పాటించకుండా అవమానించారని చర్చణీయానుషంగా మారింది.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ కర్నూలు ప్రభుత్వ అతిది గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుధవారం ఇంచార్జ్ మంత్రికి ఎస్‌పి పూల మొక్కను అందజేశారు.

మాట్లాడుతున్న వైద్యులు

'క్షయ' నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి
- మెడికల్ ఆఫీసర్ పృథ్వీరాజ్

ప్రజాశక్తి - ఆదోని

చాప కింద నీరులా విస్తరిస్తున్న క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రజలు భాగస్వామ్యం కావాలని మెడికల్ ఆఫీసర్ పృథ్వీరాజ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని శంకర్ నగర్ యుపిహెచ్‌సిలోని వైఎస్ఆర్ నగర్ 22వ వార్డులో క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సూపర్‌వైజర్లు బాబురాజు, అరుణ మేరీ, సీతారాముడు, టిబిహెచ్‌వి సుబ్బమ్మ బాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీరాజు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి క్షయ ముక్త్ అభియాన్ కార్యక్రమం ద్వారా నిర్వహించే గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించుకోవాలని, క్షయ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వమే ఉచితంగా ఆరు నెలల మందులు ఇస్తుందని చెప్పారు. వారికి నెలకు రూ.1000 చొప్పున ఆరు నెలలు ఇస్తుందన్నారు. ఎఎన్ఎంలు పి.అనసూయ, ఆశావర్కర్లు ఈరమ్మ, నాగలక్ష్మి, శాంతి ఉన్నారు.

టిడిపితోనే గ్రామాలాభివృద్ధి
- నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

భూమి పూజ చేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మూలదొడ్డి గ్రామంలో మండల అధ్యక్షులు జ్ఞానేశ్ అధ్యక్షతన టిడిపి సీనియర్ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దకడబూరు మండలం మేకడోన నుంచి కల్లుకుంట గ్రామం వరకు రూ.1.35 కోట్లతో, మూగలదొడ్డి గ్రామంలో రూ.1.25 కోట్లతో రోడ్డు 3.45 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసినట్టు తెలిపారు. నాబార్డ్ నుంచి నిధులు మంజూరయ్యాయని, పనులను నాణ్యతతో చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. టిడిపి నాయకులు వక్రాని వెంకటేష్, జక్కనగేని వెంకటేశ్వర్లు, హోళగుంద కోసిగయ్య, తాయన్న, రామకృష్ణ, చింతగేని నర్సిరెడ్డి, కృష్ణారెడ్డి, చంద్ర వీరారెడ్డి, శంకర్, రఘు, లక్ష్మన్న, చంద్రకాంత్, అయ్యప్ప పాల్గొన్నారు.

పరుగు పందెంలో శ్రీమఠం ఎద్దు గెలుపు

ప్రజాశక్తి - మంత్రాలయం

నందవరం

ఏరువాక పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పరుగు పందెంలో శ్రీరాఘవేంద్రస్వామి మఠానికి చెందిన ఎద్దు విజయం సాధించింది. బుధవారం స్థానిక సంత మార్కెట్‌లో సర్పంచి భీమయ్య ఆధ్వర్యంలో సందర్శకులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వృషభాల పారువేట కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఎస్ఐ శివాంజల్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. వృషభాల పారువేట కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్తులు, మహిళలు, యువత తరలివచ్చారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి గ్రూపు.. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, సీనియర్ నాయకులు పూజారి వ్యాసరాజాచార్, గణేకంటి రఘు, చిన్న సుంకప్ప, హండే అనుమంతు, వనికె నాగరాజు, టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి గ్రూపు.. టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, నాయకులు అశోక్ రెడ్డి, ఎంపిటిసి సభ్యులు ఎంబి.వెంకటేష్, రఘు, వైసిపి మండల ఉపాధ్యక్షులు, సర్పంచి భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. **నందవరం** గ్రామంలో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామస్తులు ఎద్దులను అలంకరించి గ్రామంలో వీధుల గుండా ఊరేగించారు. ఈ వేడుకలో మాధవరావు దేశాయ్ పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని పలు గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా సాగాయి. నేమకల్లు, కుందనగుర్తి, దౌల్తాపురం, నంచర్ల, చిప్పగిరి గ్రామ రైతులందరూ ఎద్దుల కొమ్ములకు రంగులు వేసి అలంకరించి పారువేట కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఎద్దులను పారించి ఏ ఎద్దులయితే ముందుగా వస్తాయో ఆ ఎద్దులను ఊరేగింపుగా డప్పు, వాయిద్యాలతో మెరివిని చేస్తారు.

హామీలు నీటిమూటలే..!

- అన్ని రంగాల్లోనూ వెనుకబాటు..! - ఏడాది పూర్తయినా హామీలు
- ఎమ్మెల్యేకు గ్రాఫ్ తగ్గిందంటున్న విశ్లేషకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ వెనుకబడింది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్థసారథి ఇచ్చిన హామీలు నీటిమూటలుగానే మిగిలాయి. గతంలో పరిశ్రమలు, ఫ్యాక్టరీలతో ఆదోనికి రెండో ముంబయిగా పేరుంది. మారిన సంస్కరణలు, పాలకులకు ముందుచూపు లేక నూలు మిల్లు, ఆయిల్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. వ్యవసాయ మార్కెట్ యార్డు, కాటన్ జిన్నింగ్ ఫ్యాక్టరీలు మినహా ఇతర ఉపాధి అవకాశాలు లేవు. చేయడానికి పనుల్లేక ఇక్కడి ప్రజలు దూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఇక్కడ పాలకులు మారితేనే జీవితాలు మారతాయని ప్రజలు భావించారు. పాలకులు మారినా ప్రయోజనమేమీ లేదని ఇప్పుడు విమర్శిస్తున్నారు.

2024 ఎన్నికల్లో వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, కూటమి బలపరిచిన బిజెపి అభ్యర్థి పార్థసారథి ప్రధాన అభ్యర్థులుగా పోటీలో నిలిచారు. కొత్త వ్యక్తికి అవకాశం ఇవ్వాలన్న చర్చ జనాల్లో సాగింది. చివరికి పార్థసారథికి ఎమ్మెల్యేగా పట్టం కట్టారు. ఎమ్మెల్యేగా గెలిచిన పార్థసారథి మొదట్లో అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావించడం, సంబంధిత మంత్రులకు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం చేశారు. గతంలో వైసిపి నాయకులు చేసిన ఆగడాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి అక్రమాలు నిగ్గు తేల్చాలని ఫిర్యాదులు చేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం మినహా ఎలాంటి పరిష్కారమూ చూపకపోవడంతో ప్రాధాన్యత తగ్గి ప్రజల్లో నమ్మకం సన్నగిల్లింది. కొత్తలో ఉన్న గ్రాఫ్ ప్రస్తుతం ఎమ్మెల్యే పార్థసారథికి లేదని పరిశీలకులు చెబుతున్నారు.

ఇచ్చిన హామీలు...

- రెండో 'ముంబయి'గా ఆదోనిని మారుస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చినా ఇంత వరకు పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు కల్పించలేదు.
- ఆదోనిలో ఉన్న రైల్వే సౌకర్యంతో ఉద్యోగాల సృష్టికి పరిశ్రమలను తెప్పిస్తామని చెప్పినా ఒక్క జాబ్ మేళా కూడా నిర్వహించలేదు.
- రవాణా, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తూ వాణిజ్యాన్ని విస్తరించే దిశగా అడుగులు వేస్తామని హామీ ఇచ్చారు.
- ఇంత వరకు రోడ్ల విస్తరణ మరచి తోపుడు బండ్లు, వీధి వ్యాపారుల షెడ్లను తొలగించి ఉపాధి లేకుండా చేశారు.
- డ్రెయినేజీ వ్యవస్థను మెరుగ్గా నిర్మించడం, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడం, శాశ్వత పరిష్కారాలు చూపుతామని చెప్పారు. నాటి పరిస్థితి మారలేదు.
- కర్ణాటక ప్రాంతంలో తుంగభద్ర దిగువ కాలువ ద్వారా అండర్ గ్రౌండ్ ద్వారా పంటలకు నీరు తెస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు ఏరియాను కూడా ఎమ్మెల్యే పరిశీలించలేదు.
- నగరాభివృద్ధిలో భాగంగా పట్టణంలో అండర్ డ్రెయినేజీ, రోడ్డు వెడల్పు వేయిస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు.
- వ్యాపారులతో కమీషన్లు తీసుకోబోమని హామీ ఇచ్చినప్ప టికీ వారి అనుచరులు, వ్యాపార అసోసియేషన్ల ద్వారా మామూలు అడుగుతున్నారని ఇటీవల సోషల్ మీడియా లో వాయిస్ రికార్డు హల్‌చల్ అయింది. లారీ యజమాని పోలీసులు ఆశ్రయించిన ఘటన చోటు చేసుకుంది.
- గ్రామాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు, మెట్ట ప్రాంతాల్లో కూడా ప్రతి ఎకరాకూ నీరందించి సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చి తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు.
- పాత బస్టాండ్ మైదానంలో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా పనులు మొదలు కాకపోవడంతో అర్థాంతరంగా పనులు ఆగిపోయాయి.
- అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాల పనులు పూర్తి చేయిస్తామని చెప్పి నిర్మాణం నిలిచి రాజకీయ గ్రహణం పట్టడంతో వచ్చిన హెల్త్ ప్రొఫెసర్లు కూడా కర్నూలుకు తిరిగి వెళ్లారు.
- కొత్తగా మంజూరైన డిగ్రీ కళాశాల భవనం కట్టిస్తామని చెప్పి స్థల సేకరణ జరగక, నిధులు మంజూరు కాక అద్దె భవనంలోనే కొనసాగుతోంది.
- ఆదోనిలో భూ కబ్జాలు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సహచరులు తప్పుడు ఆధార్‌కార్డు సృష్టించి లక్షలాది రూపాయల విలువచేసే భూముల ను రిజిస్టర్ చేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది.
- ఆదోని శివారులో జరుగుతున్న బైపాస్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పనులు నత్తనడకన సాగుతున్నాయి.
- పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని హామీ చెప్పినా ఇంతవరకు సర్వే జరగలేదు. ప్రతిపాదన కూడా ప్రభుత్వానికి పంపలేదు.
- ముస్లింలకు ఈద్గా, షాదీఖానా నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. గతంలో పనులు మొదలైనా ప్రస్తుతం ఈద్గా నిర్మాణం కూడా ఆగిపోయింది. షాదీఖానా అసంపూర్తిగానే నిలిచింది.
- ఆదోని ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేయిస్తామని హామీ చెప్పినా ఇంతవరకు భూసేకరణ జరగలేదు. ప్రస్తుతం బసాపురం వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది.
- తుంగభద్ర నది పరివాహక ప్రాంతమైన మేళిగనూరు వద్ద వరద కాలువ నిర్మించి సాగునీరందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇంతవరకు ఎమ్మెల్యే పార్థసారథి ఆ ప్రాంతాన్ని కూడా సందర్శించలేదు. రైతులకు కూడా ఆశలు వదులుకున్నారు.
- ఇస్వి కొండల్లో ఒక టిఎంసి సామర్థ్యంతో నీటి ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని చెప్పినా.. ఎన్నోసార్లు ఎమ్మెల్యే పార్థసారథి అసెంబ్లీలో మాట్లాడినా ఈ ప్రాజెక్టు గురించి ప్రస్తావన చేయలేదు.
- వేదవతి ప్రాజెక్టు నిర్మాణం జరిగేలా చూస్తామని హామీఇచ్చారు. వేదవతి నిర్మాణం పూర్తయితే తాగు, సాగునీటికి కొదవలేదు. ఇంతవరకు ఎలాంటి కృషి చేయలేదు.
- ఎమ్మెల్యేగా ఏడాది గడచినా హామీలు నెరవేరలేదని ప్రతిపక్షాలు, విపక్ష నాయకులు అంటున్నారు.

మాటలు తప్ప చేతుల్లో చూపడం లేదు
- వెంకటేశులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు

నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తామని చెప్పి ప్రజలను నిరాశకు గురి చేశారు. తాగునీటి ఎద్దడితో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తుంగభద్ర నది నుంచి మేళిగనూరు వద్ద వరద కాలువ ఏర్పాటు చేయించి ప్రతి ఎకరాకూ సాగునీరు ఇస్తామని చెప్పి మోసం చేశారు. కేంద్రంలో పలుకుబడి ఉందని.. నిధులు తెప్పిస్తామని గొప్పలు చెప్పారు. ఏం నిధులు వచ్చాయో ప్రజలకు తెలపాలి. ఉపాధి కరువై రైతులు, వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి చూపాల్సిన పాలకులు మొద్దునిద్ర పోతున్నారు. ఆదోని ప్రజల తాగునీటి అవసరాలకు మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మిస్తామని చెప్పి కనీసం అడుగు కూడా ముందుకు పడలేదు. ఇలాగే వ్యవహరిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

అభివృద్ధి పథకాలకు ఆటంకం తగదు
- నరసింహులు, మున్సిపల్ వైస్ చైర్మన్, వైసిపి నాయకులు

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కృషి చేశారు. మెడికల్ కళాశాల, హైవే రోడ్డు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, డిగ్రీ కళాశాల, ఇతర పథకాలు తెచ్చారు. అధికారంలోకి రాగానే కూటమి నాయకులు ఆటంకాలు కలిగిస్తూ అభివృద్ధిని అడ్డుకోవడం తగదు. ఎమ్మెల్యే పార్థసారథి అభివృద్ధి చేసిందేమీ లేదు. కనీసం ప్రజల్లో కూడా మమేకం కాలేకపోతున్నారు. ఆదోని అభివృద్ధి చెందాలంటే సాయి ప్రసాద్ రెడ్డితోనే సాధ్యం. దౌర్జన్యాలు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ఎమ్మెల్యే అనుచరులు, బిజెపి నాయకుల వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా ఎమ్మెల్యే స్పందించడం లేదు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారు. ఎమ్మెల్యే పార్థసారథి మాత్రం అన్ని రంగాల్లో వైఫల్యం చెందారు.

'యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల సందర్భంగా యువతకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మండగిరిలో డివైఎఫ్ఐ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా జమీర్, వీరబాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ కోసం నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. ఏడాది పాలన పూర్తి చేసుకున్నా యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న వీరేష్

తీరిన లోవోల్టేజీ సమస్య

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని ఖాజీగడ్డ, ఎన్‌టిఆర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీల్లో కొంతకాలంగా త్రీఫేస్ విద్యుత్ లేకపోవడం వల్ల స్థానికులు లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రత్యేకించి ఏరియా పరిధిలో విద్యుత్ ఒత్తిడి (వోల్టేజీ) తక్కువగా ఉండడంతో మోటార్లు, ఫ్రిడ్జ్‌లు, ఇతర ఎలక్ట్రిక్ పరికరాలు సరిగ్గా పనిచేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గమనించిన కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ గతంలోనే సంబంధిత విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి అహర్నిశ శ్రమ వల్ల మొదట దశలో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించేందుకు అధికారులు అంగీకరించి, సంబంధిత ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటైనా త్రీఫేస్ లైన్ లేకపోవడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా కలగక ప్రజలు మళ్లీ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ నిరంతరంగా వెంట పడి అధికారులపై ఒత్తిడి తెచ్చి, మిగిలిన త్రీఫేస్ విద్యుత్ లైన్ పనులను పూర్తి చేయించారు. బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాలనీల వరకు త్రీఫేస్ లైన్లను పూర్తిగా ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ మాట్లాడారు. ఈ ప్రాంతాల్లో ప్రజలు చాలా కాలంగా విద్యుత్ సమస్యలతో బాధపడుతున్నారని, వారి బాధను తాను వ్యక్తిగతంగా అనుభవించానని తెలిపారు. ఇది తన బాధ్యతగా భావించి సంబంధిత అధికారులతో చర్చలు జరిపి, చివరకు త్రీఫేస్ విద్యుత్ లైన్ పనులు పూర్తయ్యేలా చేయించానని చెప్పారు. ఇక్కడి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయించామన్నారు.

తీగలను సరి చేస్తున్న సిబ్బంది

'మోడల్'లో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం
- ప్రిన్సిపల్ షాహినా పర్వీన్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని ఎపి మోడల్ పాఠశాలలో 7, 8, 9వ తరగతిలో ఖాళీ సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ బుధవారం కోరారు. ఈనెల 10 నుంచే దరఖాస్తులు స్వీకరిస్తున్నా మని, దరఖాస్తులకు ఈనెల 20 వరకు గడువు ఉందని తెలిపారు. ఖాళీ సీట్ల విషయంలో సమాచారం కోసం ప్రిన్సిపల్‌ను సంప్రదించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈనెల 24న ఉదయం 10 గంటలకు నిర్వహించే పరీక్షకు హాజరు కావాలన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం
- సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్

ప్రజాశక్తి- దేవనకొండ

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సర్పంచి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని తెర్నేకల్ గ్రామంలో బుధవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం వల్ల అనర్థాలు జరుగుతాయని, బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలని తెలిపారు. ఒకే ఇంట్లో ఉన్న కుమారుడు, కుమార్తె పట్ల లింగ వివక్షత చూపకూడదని చెప్పారు. బాలల హక్కులు, చట్టాల గురించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి అరుణ్ కుమార్

తహాశీల్దార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -దేవనకొండ


దేవనకొండ...

దేవనకొండ తహాశీల్దార్‌గా రామాంజనేయులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా గూడూరు మండలం నుంచి దేవనకొండకు బదిలీపై వచ్చారు. ఇక్కడ తహాశీల్దార్‌గా పనిచేసిన ప్రసాద్ రాజు పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

హాలహర్వి

హాలహర్వి తహాశీల్దార్‌గా లక్ష్మీ నారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న డిటి లక్ష్మి పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

14న వక్ఫ్ బిల్లుపై భారీ బహిరంగ సభ
- ఆలిండియా ముస్లిం లాబోర్డు సభ్యులు

ప్రజాశక్తి - ఆదోని

కేంద్ర ప్రభుత్వం చేసిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఈనెల 14న పట్టణంలో సభ ఆల్ ఇండియా ముస్లిం లాబోర్డు ఆధ్వర్యంలో భారీ బహిరంగ నిర్వహిస్తున్నట్లు ఆదోని ఆల్ ఇండియా ముస్లిం లా బోర్డు కన్వీనర్ జునేద్ అహ్మద్, ఖతీబ్ సాబ్ జునేద్ హాష్మి, మసీదుల ఇమాం సాబ్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. ఈనెల 14న పట్టణంలోని పెద్ద మసీదు వెనుకవైపు ఉన్న మసూదియా ఉన్నత పాఠశాల మైదానంలో సాయంత్రం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం వల్ల ముస్లింలకు అన్యాయం జరుగుతుందని, భవిష్యత్తులో ఇంకా అన్యాయం జరిగే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ బహిరంగ సభకు డివిజన్‌లోని 9 మండలాలకు చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు..

అభివృద్ధికి నోచని 'మజరా'

- గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వని ప్రజాప్రతినిధులు, అధికారులు
- సిసి రోడ్ల నిర్మాణాలకు నోచని సంగాల, ఖాజీపురం కొట్టాల వీధులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని మజరా గ్రామాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఆ గ్రామాలు అభివృద్ధికి నోచడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లె ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నాయి. కిందిస్థాయిలో ఆ దశగా అభివృద్ధి పనులు సాగడం లేదు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జనాభా ఎక్కువ ఉన్న పల్లెటూళ్ల మీదనే దృష్టి పెట్టి అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. మండలంలో మజరా గ్రామాలు కూడా ఉన్నాయని, వాటికి కూడా ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి పనులు చేపడితే బాగుంటుందని కోరుతున్నారు.

నేమకల్లు పంచాయతీలోని మజరా గ్రామమైన సంగాలలో వీధుల పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. వీధుల్లో ఉన్న మురుగునీటిలో ప్రజలు నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శివాలయం పక్కనే ఉన్న వీధిలో, పైగేరికి వెళ్లే వీధిలో మురుగునీటి వాసన దుర్భరంగా ఉందని, ఆ వీధుల్లో సిసి రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వర్షం వస్తే ఏ వీధిలోనూ నడవడానికి వీలు లేకుండా పోతోంది. సంగాలలో సిసి రోడ్లు వెంటనే చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గుమ్మనూరు పంచాయతీలోని మజరా గ్రామం ఖాజీపురం కొట్టాల, నగరడోనా పంచాయతీలోని మజరా గ్రామం తిమ్మాపురంలోనూ తాగునీటి సమస్య వేధిస్తోంది. పక్క ఊరు నేమకల్లుకు వెళ్లి ఫిల్టర్ వాటర్ కేంద్రంలో డబ్బులు చెల్లించి తెచ్చుకుని నీరు తాగుతున్నామని తిమ్మాపురం గ్రామస్తులు వాపోతున్నారు. ఇక్కడ ఫిల్టర్ వాటర్ కేంద్రం ఉన్నా విద్యుత్ బకాయిలు ఎక్కువ ఉన్నాయని, విద్యుత్ కనెక్షన్ తీసి వేశారని ప్రజలు పేర్కొంటున్నారు. సిసి రోడ్ల వసతి సరిగ్గా లేదని, తిమ్మాపురం గ్రామానికి వెళ్లే అడ్డరోడ్డు కంకర తేలి, గుంతలు పడి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి పనులు, తిమ్మాపురం గ్రామానికి వెళ్లే అడ్డరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మజరా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సంగాలలో మురుగు కాలువలో నడుస్తున్న ప్రజలు

తిమ్మాపురం అడ్డ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి
- నాగిరెడ్డి, తిమ్మాపురం

రోజూ గ్రామం నుంచి విద్యార్థులు, ప్రజలు రోడ్డుకు నడవాల్సి ఉంది. రోడ్డంతా కంకర తేలి ఉండడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మారుమూలన గ్రామం ఉండడంతో ఏ వాహనాలూ మా గ్రామానికి రావడం లేదు. నేమకల్లు బస్టాండ్ దిగి గ్రామానికి నడవాల్సి ఉంది. కంకర తేలిన రోడ్డుకు మరమ్మతులు చేపడితే నడవడానికి వీలుగా ఉంటుంది.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

బీసీలను చిన్న చూపు చూస్తే సహించబోం
- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బీసీలను చిన్నచూపు చూస్తే సహించేది లేదని టిడిపి నాయకులు హెచ్చరించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కురువ మద్దిలేటి, రంగస్వామి నాయుడు, దామా నరసింహులు, బందే నవాజ్ మాట్లాడారు. కురువ కులస్తులకు మార్కెట్ యార్డు ఛైర్మన్ ఇస్తే మీకెందుకు ఇష్టం లేదని నందవరం మండలానికి చెందిన మాధవరావు దేశాయ్‌ని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆశీస్సులతో కురువ మల్లయ్యను మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా అధిష్టానం నిర్ణయించిందని తెలిపారు. ఛైర్మన్‌గా మల్లయ్యకు ఇస్తే మాధవరావు దేశాయ్‌కి ఎందుకు ఇష్టం లేదో తెలుపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం తెలిసిన వ్యక్తి మల్లయ్య అని, రైతుల కష్టాల గురించి ఆయనకు బాగా తెలుసు అని అన్నారు. మాధవరావు దేశాయ్ మల్లయ్యకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి అన్ని కులాలకు న్యాయం చేస్తున్నారని, పార్టీలో ఉంటూ పార్టీకి వెన్నుపోటు పొడిచిన వారికి ఎప్పుడూ స్థానం ఉండదని తెలిపారు. రాయచూరులో కోవర్టు రాజకీయాలు చేసింది ఎవరని ప్రశ్నించారు. 2014-19లో మార్కెట్ యార్డు ఛైర్మన్ చేసింది ఎవరని నిలదీశారు. నియోజకవర్గ బీసీలందరూ ఎమ్మెల్యే డాక్టర్ బీవీకి రుణపడి ఉంటారని తెలిపారు. దావిద్, నరసింహులు, సాలెం, డబ్బా ఈరన్న పాల్గొన్నారు.

దాడులకు పాల్పడితే సహించేది లేదు
- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి
- మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్యకు పరామర్శ

ప్రజాశక్తి - మంత్రాలయం

లక్ష్మయ్యను పరామర్శిస్తున్న రాఘవేంద్రరెడ్డి

వైసిపి నాయకులు దాడులకు పాల్పడితే సహించేది లేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి హెచ్చరించారు. ఇటీవల వైసిపి, టిడిపి నాయకులు న్యాయవాది గురురాజ రావు, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో గాయపడి చికిత్స పొంది ఇంటికి చేరుకున్న లక్ష్మయ్యను బుధవారం మండలంలోని మాలపల్లిలోని ఆయన స్వగృహంలో కలుసుకొని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో కూటమి ప్రభుత్వం మీద పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. వైసిపి గుండాలు కులాల పేరుతో రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తూ గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారని తెలిపారు. ఘర్షణలో గాయపడిన లక్ష్మయ్యకు, ఆయన సోదరులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టిడిపి నాయకులు పల్లెపాడు రామిరెడ్డి పాల్గొన్నారు.

ఏడో రోజూ 'మున్సిపల్' నిరసన

ప్రజాశక్తి - ఆదోని

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన దీక్ష బుధవారం ఏడో రోజుకు చేరింది. ఆదోని భీమాస్ కూడలిలో చేపట్టిన శిబిరానికి కార్మిక సంఘాలు, పలువురు మద్దతు ప్రకటించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు ఐఎఫ్‌టియు నాయకులు వెంకప్ప సంఘీభావం తెలిపారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ శాంత, ఆమె భర్త సింహం నాగేంద్ర, వ్యవసాయ మార్కెట్ యార్డు అవుట్‌సోర్సింగ్ కార్మికులు సంఘీభావం తెలిపారు. సోమన్న, హమీద్, పీరా, కరెప్ప, శివ తదితరులు దీక్షలో కూర్చున్నారు.



శిబిరంలో దీక్షకు కూర్చున్న మున్సిపల్ కార్మికులు

జర్నలిస్టులకు రక్షణ చట్టం తేవాలి : ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జర్నలిస్టులకు రక్షణ చట్టం తక్షణమే అమలు చేయాలని, జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ తాలూకా నాయకులు ఎస్‌కె.షబ్బీర్, రామకృష్ణ, నాగరాజు, గిప్సన్ డిమాండ్ చేశారు. బుధవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో తహాశీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. నాయకులు దేవేంద్ర మూర్తి, శంకర్, ఖలీల్, నరసింహులు, రంగయ్య, రాజు, ఇలియాస్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోనిరూరల్ : జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు కోరారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు నాగరాజు, అధ్యక్షులు బసవరాజు, ఉపాధ్యక్షులు ఉరుకుందప్ప, విజయ్ మాట్లాడారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపు సమస్య చాలా ఏళ్లుగా అపరిష్కృతంగా ఉందని, ఎన్నికల సమయంలోనే జర్నలిస్టులకు ఇంటి స్థలం కేటాయిస్తామని ప్రణాళికలో ప్రకటించడంతో అందరూ ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అక్రిడిటేషన్ కమిటీలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎలకు ప్రాతినిధ్యం కల్పించాలని, జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు హోంమంత్రి నేతృత్వంలో హైపవర్ కమిటీ, జిల్లాలో ఉన్నత పోలీసు అధికారులతో కూడిన కమిటీలు వేయాలని తెలిపారు. సభ్యులు భీమా, తిమ్మప్ప, చంద్ర, మురళీ, వీరేష్, రఘునాథ్ రెడ్డి, యువరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆదోనిలో మీనాక్షి నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు